డాక్టర్ వర్మ ఉద్రేకపడలేదు. జ్యోత్స్న ఊహించుకున్నట్టు చంపెయ్యనూ లేదు. కనీసం పల్లెత్తుమాట అయినా అనలేదు. అతని గొంతు చాలా గంభీరంగా వుంది.

"జ్యోత్స్నా! నిన్ను ఏరి, కోరి చేసుకొన్నాను నేను నీ ఊపిరిలో నాలోని సైంటిస్టు జీవం పోసుకున్నమాట వాస్తవం. ఇన్నాళ్ళకు నా కృషి ఫలించింది. అంతర్జాతీయంగా నాకు గుర్తింపు లభించే, నాదేశం గర్వించే పరిశోధన సిద్ధించింది. కాని జోత్స్నా ఆ నా పరిశోధనకు ఏం పేరు పెట్టానో తెలుసా? 'జ్యోత్స్న జనిటికల్ కోడ్'... హుఁ.... కవిగానీ, కళాకారుడుగానీ, సైంటిస్ట్‌కానీ.... అందరూ మనుషులే, జ్యోత్స్నా! అందరి లోనూ కొట్టుకునేది గుండే!! నిన్ను ఎంతగా ప్రేమిస్తున్నానో నీకు తెలియదు. ఎంతగానో చెప్పనా నీ సుఖంకోసం, నీ సంతోషంకోసం.... నువ్వు కోరిన ప్రకారంగా నిన్ను వదులుకునేటంత గొప్పగా ప్రేమిస్తు న్నాను!! ... ఆల్ రైట్.... నేను రచయితను కాదు.... ఏవేవో అందంగా చెప్పేందుకు నాకు భాష రాదు కానీ, జోత్స్నా! భావం వుంది. గుండె ఉంది చెప్పానుగా?.... నిన్ను నాతో మాస్కో తీసుకెళ్ళాలని.... నాకు అందబోయే ఆనందం నీకూ పంచాలనీ ... ఏవేవో కలలు కంటూ వచ్చాను. ఇంటికి.... ప్చ్....ప్చ్ ....ఎనీ హౌ.... స్వేచ్ఛను చంపే దుర్మార్గుణ్ణి కాదు. కానీ, నా కళ్ళెదుట నిన్ను దూరంగా చూడలేను. నో, నావల్ల కాదు ఇవిగో కీస్ సేఫ్‌లో కావలసినంత డబ్బుంది. ఇంట్లో కావలసినన్ని వస్తువు లున్నాయి, నీకేంకావాలో, ఎంత కావాలో తీసుకో. నాకేం అభ్యంతరం లేదు కానీ ... కానీ, జ్యోత్స్నా! మరొక్కసారి బాగా ఆలోచించనిదే నీ నిర్ణయానికి జీవం పోయకు. ఆ తరువాత నీ ఇష్ట ప్రకారం చెయ్యి. ఓ కె!....నేను మాస్కో వెళుతున్నాను. బహుశా నాలుగు రోజులు అక్కడే ఉండచ్చు. నేను తిరిగి వచ్చేలోపల నీ అభీష్టాన్ని యదేచ్ఛగా సాగించుకో. మరోమాట. నువ్వు నాతోనే ఉండాలని నిర్ణయించుకున్నా నాకేం

డాక్టర్ వర్మలో వెయ్యి ఏనుగుల బలం వచ్చింది. మానసికంగా ఇంత ఆనందం మాస్కోలో కూడా అనుభవించలేదు.

స్నానంచేసి, తన రూమ్‌లోకెళ్ళి బట్టలు మార్చుకున్నాడు నిలువెత్తు అద్దం చూసుకుంటూ తల దువ్వుకుంటూ జ్యోత్స్నకు ఎన్నో కబుర్లు చెప్పాలని, ఆమె ఒడిలో తన అలసటను తీర్చుకోవాలని అనుకోసాగాడు. తిరిగి హాల్లోకి వస్తుండగా, తన టేబిల్ మీద "ఎర్ర లేబిల్ కవరు" కనిపించింది. 'వెరీ అర్జెంట్ మెసేజ్' మాత్రమే అలా అక్కడ వుంటుంది. వెంటనే వెళ్ళి, ఆకవరు అందుకుని, చించి చదివాడు. అందులో ఇలా వుంది.

"మిమ్మల్ని ఏమని సంబోధించాలో అర్థం కావడం లేదు. భగవదంశ మీలో వుంది. అందుకే మిమ్మల్ని నా దేవునిగా నమస్కరిస్తున్నాను.

హిందూ స్త్రీలో ప్రవహించే మహర్షుల రక్తం నాలో పెల్లుబికింది. మీరు వెళ్ళాక మిమ్మల్ని నేను సరిగా అర్థం చేసుకోలేక పోయాను. మీరిచ్చిన స్వేచ్ఛను, ఆధిక్యాన్ని అనవసరంగా మరోలా ఉపయోగించుకున్నాను. వివాహ బంధానికి నిజమైన అర్థం చాలా ఆలస్యంగా తెలుసుకోగలిగాను. మీ భార్యగా నేను మీ నుండి పొందిన ప్రేమా, పేరూ అమూల్యం. అంతటి మీ ప్రేమపూజకు ఇంక నేను అనర్హురాలిని మీ నిర్విరామ కృషికి, మీకు తోడుగా మీతో నిలిచిన "జ్యోత్స్న జనిటికల్ కోడ్"లోని "జ్యోత్స్న" ఎప్పటికీ మీ గుండెల్లోనే వుంటుంది. నేను మాత్రం శిక్ష అనుభవించాలి అందుకే మీకు దూరంగా వెళ్ళిపోతున్నాను. ప్రపంచ ప్రఖ్యాత సైంటిస్టు భార్యగా కాదు; హృదయమున్న సంస్కారి ప్రేమపూజకు నోచుకుని అభాగ్యురాలిగా!

నమస్కృతులతో

కలుషిత.,

– (మీ) జ్యోత్స్న

డాక్టర్ వర్మ హృదయం ఆవేదనతో స్పందించింది.

'ఏమిటది? జ్యోత్స్న ఎందుకిలా రాసింది.? బహుశా- ఆవేళ రాసి పెట్టిందేమో??... ఏమో,..?

తల ఎత్తాడు...

ఎదురుగా గోడలకు తగిలించి వున్న అనేకమంది సైంటిస్ట్లు, మేధావులు ఏదో సందేశాన్ని గ్రుమ్మరించారు గుండెల్లో....

'నో...నో...

ఉత్తరాన్ని మడిచి జేబులో వుంచుకున్నాడు పెళ్ళినాటి ఫోటోలో తన ప్రక్కన జ్యోత్స్న అలవోకగా నవ్వుతూ వుంది.

"ఏదీ జ్యోత్స్న? కనిపించినట్లు కనిపించి, అదృశ్యమయ్యాడు???....

కిచెన్‌రూమ్ కేసి నడిచాడు.

"రాజూ! అమ్మగారెక్కడ?"

"మేడమీద వున్నారు సార్"

గుండె కొంచెం కుదుటపడింది.

మెట్లెక్కాడు డాక్టర్ వర్మ. మేడమీది బెడ్‌రూమ్‌లోకి వెళ్ళాడు. తను మక్కువగా మెడలో వేసిన గులాబీ మాలలతో అలాగే బెడ్ మీద ప్రశాంతంగా పడుకుని వుంది జ్యోత్స్న.

వెళ్ళి మధురంగా పిలిచాడు. ప్రక్కన కూర్చొని మృదువుగా కదిలించాడు

అచేతనంగా వుంది జ్యోత్స్న. కానీ ఆమె అరవిచ్చిన చేతిలో ఇంకా వున్న 'పాయిజన్' సీసా మాత్రం టప్‌మని కిందపడి ముక్కలయింది.

★